


(గత సంచిక తరువాయి)

## 13

**మర్నాడు ఉదయం** ఆద్యకి ఇండియాలోలా ఎనిమిదిం పావుకి మెలకువ వచ్చింది. అప్పటికే చైత్ర ఆఫీస్‌కి వెళ్ళిపోయింది. ఆమె కాలకృత్యాలు తీర్చుకుని క్రితంరోజు చైత్ర చెప్పినట్లుగా అరగంటసేపు ఈతకొలనులో సాధనచేసి వచ్చేసరికి పనిచేసే అనస్థాషియా కనిపించింది. ఆమెని 'గుడ్ మార్నింగ్' అని విష్ చేసి, స్నానం చేసి బ్రెడ్ టోస్ట్ చేసుకుని జాం, బటర్‌ని రాసుకుని బ్రేక్‌ఫాస్ట్‌ని తింది. అనస్థాషియా పనిచేసి వెళ్ళిపోయాక ఇంకో కప్పు కాఫీ కలుపుకుని టి.వి ముందు కూర్చుంది. ఆన్ చేయగానే బి.బి.సి ఛానల్ కనిపించింది. వినగానే ఘానా గురించి చెప్తున్నారని గ్రహించింది.

"...సెక్సువల్‌గా కూడా కొందరు ఆ అమ్మాయిలని ఉపయోగించుకుంటారు. వారికి తిండి, బట్ట, వైద్య సహాయం పెద్దగా అందవు. ఐనా చర్చ్‌కి తమ ఆడపిల్లల్ని ఇవ్వడం వల్ల తాము స్వర్గానికి వెళ్తామని ఘానా ప్రజలు నమ్ముతారు. ఈ చెడ్డ సంప్రదాయాన్ని అరికట్టాలి. ఇరవై నాలుగో ఏట ట్రోకోసినించి బయటకి వచ్చిన జూలియానా దాగ్ బంజీ ఘానా దేశంలో పర్యటిస్తూ దీనికి వ్యతిరేకంగా పోరాడుతూ ఉద్యమం చేస్తోంది. ఆమెతో ఓ చిన్న నగరంలోని చర్చ్‌లో జరిపిన ఇంటర్వ్యూని ఇప్పుడు వినండి."

క్రితం రోజు దాని గురించి అనస్థాషియా చెప్పడంతో ఆద్య ఆ ఇంటర్వ్యూని శ్రద్ధగా విన్నది. ఆ నల్లజాతి యువతిని పరిచయం చేసాక ఆమె చెప్పిన పాస్టర్‌తో అనుభవాలని వింటూంటే ఆద్య ఒళ్ళు గగుర్పొడిచి రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

తర్వాత ఏంకర్ చెప్పాడు.

"పాకిస్థాన్‌లో సింధ్, పంజాబ్, బెలూచిస్థాన్, ఖైబర్‌పాస్‌లలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి దురాచారం ఉంది. అప్పు తీసుకుని చెల్లించలేకపోతే నష్టపరిహారంగా వయసులోని చెల్లెల్నో, భార్యనో ఆ గ్రామపెద్దల ఆధ్వర్యంలో వారికి ఇచ్చేస్తారు. జీవితాంతం ఆ అమ్మాయి అప్పిచ్చినవారికి అన్ని రకాల ఊడిగాలు చెయ్యాలి. బెలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని ఒకడు కోపంలో మరొకడిని పొడిచాడు. వాడు చావలేదు. వీడు తనకి శిక్ష పడకుండా వాడికి తన పదమూడేళ్ళ చెల్లెల్ని నష్టపరిహారంగా ఇచ్చేసాడు..."

మెసేజ్ వచ్చినట్లు అలర్ట్ సౌండ్ విని మొబైల్లో చూసుకుంది. చైత్ర నించి.

'విసుగ్గా ఉంటే వాకింగ్‌కి బయటకి వెళ్ళు. చూసావో, లేదో కాని నీ హేండ్‌బాగ్‌లో ఐదు వందల సిడీలు పెట్టాను. ఇంటి డూప్లికేట్ తాళం చెవి కూడా. కుడివైపు సందులో ఐదు నిమిషాల నడక దూరంలో 'కంట్రీసైడ్ క్లబ్' అనే రెస్టరెంట్ ఉంది. లంచ్‌కి అక్కడికి వెళ్ళిరా. లేదా ఎడం వైపు వెళ్తే జర్మన్స్ నడిపే 'కాఫీ కప్' రెస్టరెంట్ కనిపిస్తుంది. బయటకి వెళ్ళేప్పుడు మస్కిటో రెపెల్లెంట్ స్ప్రే చేసుకోవడం మర్చిపోకు. నిన్ను మళ్ళీ జాగ్రత్తగా వెనక్కి పంపాలి.'

ఆద్యకి మస్కిటో రెపెల్లెంట్ వాసన సెంట్‌లా బావుంది. దాన్ని స్ప్రే చేసుకుంటూ తను టి.విలో విన్నదాని గురించి ఆలోచించింది. తను ఘానాలో పుట్టి, తనని తన తల్లితండ్రులు ట్రోకోసీకి పంపి ఉంటే ఇప్పుడు జీతం లేకుండా, నాదనేది లేకుండా తను ప్రీస్ట్ పొలంలో పనిచేస్తూండేదా? అప్పుడు తనెలా ఫీలయ్యేది? తన బంధువులు స్వర్గానికి వెళ్తారని ఆనందించేదా? లేక ఆ గొడ్డు చాకిరీకి శారీరకంగా, మానసికంగా కష్టపడేదా? దేవదాసీలే నయం. కేవలం గుళ్ళో నృత్యంతో సరి. లోకంలో ఎన్ని భ్రష్టాచారాలో! 'ఇలాంటి దురాచారాలు లేని భద్రమైన చోట పుట్టాను. థాంక్ గాడ్ ' అనుకుంది. తను ఘానాలో పుట్టనందుకు సంతోషించింది. తర్వాత ఆ ఆలోచనకి ఆమెకి నవ్వొచ్చింది.

హేండ్‌బాగ్ తీసుకుని బయటకి వచ్చింది. చల్లటి గాలి రివ్వున వీస్తోంది. తలుపు హేండిల్‌కి వేసిన రబ్బర్ బేండ్ తీసి తాళ వేసి కాలినడక గేట్‌లోంచి బయటకి వెళ్తూంటే డ్యూటీలోని ఎబెనేజర్ పలకరించాడు.

"గుడ్ మార్నింగ్ మేం. ఎంజాయింగ్ ఘానా?"

"ఎస్. థాంక్స్ మిస్టర్ ఎబెనేజర్. ఐ విల్ బి బేక్ షార్ట్లీ." చిరునవ్వుతో చెప్పింది.

అతను తలెత్తి పైన నల్లటి మేఘాలని చూసి తన గొడుగుని ఇచ్చాడు.

"ఓ! థాంక్స్."

ఓ టేక్సీ డ్రైవర్ ఆమెని చూసి 'టిస్...టిస్..' అని శబ్దం చేసాడు. అక్కర్లేదన్నట్లుగా అతనివైపు చేతిని ఊపింది.

కొద్ది అడుగులు వేయగానే టపటప చినుకులు పడసాగాయి. గొడుగు విప్పింది కాని ఈదురుగాలికి ఆపలేక ముసేసి అటు, ఇటు చూసింది. పక్కనే బయట సైకిళ్ళు ఆగి ఉన్న, రేకుల షెడ్ కప్పు చర్చ్‌లోంచి మాటలు వినిపించాయి. దాని బయట 'చర్చ్ పాపుల హాస్పిటల్ తప్ప క్రిస్టియన్స్ క్లబ్ కాదు' అనే బోర్డుంది. ఆమె తడవకుండా ఉండటానికి అందులోకి నడిచింది. గుమ్మం దగ్గర నల్లటి సూట్లోని ఒకతను ఆమెని చూసి నవ్వుతూ ఆహ్వానిస్తూ చెప్పాడు.

"వెల్‌కం యంగ్ లేడీ. జీసస్ లవ్స్ యు."

"థాంక్స్ జెంటిల్‌మేన్."

గుమ్మం దగ్గర చిన్న బల్లమీద బైబిల్ పుస్తకాలు ఉన్నాయి. అతను ఆమెకి ఒకటి ఇచ్చాడు. మరోసారి థాంక్స్ చెప్పిదాంతో లోపలికి నడిచింది.

ఆ చర్చ్ కప్పు పైన వర్షం చినుకులు పడి రొదగా ఉంది. సగం పైగా నిండిన చర్చ్‌లో అంతా నల్లవాళ్ళే. ఆడవాళ్ళు తలమీద బట్ట కప్పుకున్నారు. ఆడవాళ్ళంతా రంగురంగుల బట్టతో కుట్టిన షర్ట్‌లని, పెద్ద పూసల దండలని వేసుకుని ఉన్నారు. కొందరు మగాళ్ళు సూట్లలో ఉన్నారు. ఓ బెంచ్‌మీద కూర్చుని ఆద్య ప్రీస్ట్ ఇంగ్లీష్‌లో చెప్పేది విన్నది. అరవై పై బడ్డ ఆయన ఏక్సెంట్ ఆమెకి కొద్దికొద్దిగా అర్థమై అతను చెప్పే సారాంశం బోధ పడింది.

"ఓ శతాబ్దం క్రితం యునైటెడ్ బ్రెతరన్ చర్చ్‌లో మిల్టన్ రైట్ అనే పాస్టర్ 'మనిషి ఎగరలేడు. ఆ ప్రయత్నం చేయకూడదు. అది దేవుడి ఇష్టానికి వ్యతిరేకమని ' చెప్పాడు. కాని అతని ఇద్దరు కొడుకులు ఆర్విల్, విల్బర్‌లు 1903లో విమానాన్ని కనిపెట్టారు. అది నాటకీయంగా మానవ చరిత్రనే మార్చేసింది. ఓ మనిషి హృదయపూర్వకంగా దేవుడి విషయంలో నమ్మింది నిజం కాకపోతే, అది నిజం కాదు. ఇందుకు మిల్టన్ రైట్ నమ్మకమే ఉదాహరణ. నేడు ప్రపంచంలోని ఏడువందల కోట్లమంది ప్రజల్లోని అరవై ఆరుశాతం మందికి పైగా జీసస్‌ని తమ రక్షకుడిగా నమ్మరు. వారు ఇస్లాం, బుద్ధిజం, హిందూలాంటి ఇతర మతాలని పూర్తి నమ్మకంతో అనుసరిస్తారు. కాని మిల్టన్ రైట్ మనిషి గాల్లో ఎగరడం అసాధ్యమని, అది దేవుడి ఇష్టానికి వ్యతిరేకమని ఎలా తప్పుగా, నిజాయితీగా నమ్మాడో అలా వారు తమ దేవుణ్ని తప్పుగా నమ్ముతున్నారు. క్రిస్టియన్స్ కాని వారు తప్పు ఆరాధనని చేస్తున్నారు. కాబట్టి మనం మృదువుగా, ప్రేమగా వారికి జీసస్‌తో సంబంధం కలిగేలా చేయాలి. దేవుడు మనకి ఓట్ వేస్తాడు. సాటన్ కూడా మనకి ఓట్ వేస్తాడు. కాని దేన్నైనా నిర్ణయించే మూడో ఓట్‌ని మనిషే వేయాలి. ఎవరికి వేస్తాడన్న దాన్ని బట్టి ఎక్కడికి వెళ్తాడన్నది నిర్ణయించబడుతుంది. మనిషి నరకానికి ఏ మార్గంలోనైనా వెళ్ళచ్చు. కాని స్వర్గానికి కేవలం జీససే మార్గం. జీసస్ సేవ్స్. ఆమెన్."

"ఆమెన్" అంతా పలికారు.

"ప్రతీ మనిషి ఓ విషాదంతో పుడతాడు. దాన్ని భగవంతుడి ఇచ్ఛగా నమ్మాలి. ఓసారి అమెరికాలోని ఓ చిన్న పిల్ల బార్బీబొమ్మ కావాలనుకుంది. ప్రతీ సాయంత్రం ఆమె ఇంట్లోని క్రీస్తు బొమ్మముందు మోకాళ్ళ మీద కూర్చుని 'ప్లీజ్ లార్డ్! నాకీ క్రిస్టమస్‌కి బార్బీ బొమ్మని ఇవ్వు ' అని ప్రార్థించేది.

"క్రిస్టమస్ వచ్చింది. వెళ్ళింది. కాని బార్బీ బొమ్మ మాత్రం ఆ చిన్నపిల్ల చేతికి రాలేదు. జనవరి ఒకటిన న్యూ ఇయర్ గిఫ్ట్‌గా బార్బీ బొమ్మని పంపమని మళ్ళీ దేవుడిని ప్రార్థించింది. రాలేదు. జనవరి నెల చివర్లో తన పుట్టినరోజుకి బార్బీ బొమ్మకోసం మళ్ళీ ప్రార్థించింది. ఆమెకి పుట్టినరోజున వచ్చిన పేకెట్లని విప్పి చూస్తే వాటిలో బార్బీ బొమ్మ లేదు. ఆ పాప నిరుత్సాహం చెందకుండా తర్వాతి నెల వేలంటైన్స్ డేకి తనకి బార్బీ బొమ్మని ప్రసాదించమని ప్రార్థించింది. ఊహూ. వేలంటైన్స్‌డేకి చాక్లెట్స్, కేక్స్ తప్ప బార్బీ బొమ్మ రాలేదు. ఆ పాప అన్న మళ్ళీ తన చెల్లెలు బార్బీ బొమ్మకోసం ప్రార్థించడం విని విసుక్కున్నాడు.

"క్రిస్టమస్ వచ్చింది. వెళ్ళింది. పుట్టినరోజు వచ్చింది, వెళ్ళింది. వేలంటైన్స్‌డే కూడా వచ్చింది. వెళ్ళింది. ఏదీ నీ బార్బీ బొమ్మ? లార్డ్ నీ ప్రార్ధనని ఆలకించడంలేదు. నువ్వు ఇకనైనా ఆ ప్రార్ధనని ఆపేయచ్చుగా?' దానికి ఆ పాప ఏం జవాబు చెప్పిందో తెలుసా? లార్డ్‌ని నమ్మినవారి జవాబది. 'లార్డ్ నా ప్రార్ధనకి జవాబు ఇస్తున్నాడు.'

'ఏదీ ఆయన ఇచ్చిన జవాబు?' అని అన్న అడిగితే అందుకా పాప ఇచ్చిన సమాధానాన్ని జాగ్రత్తగా వినండి.

'ప్రతీసారి జవాబు ఇస్తున్నాడు. లార్డ్ నాకు నో చెప్తున్నాడు' లార్డ్ మనకి నో చెప్పినప్పుడు అది మన మంచికోసమేనని గుర్తించం. మనం కోరినదానికన్నా మంచిది ఇవ్వాలని లార్డ్ నో చెప్పిన సంగతి మనకి అది అందినప్పుడు కాని తెలీదు. ఓ మాములు రోజు ఆమె మేనమామ ఫోన్ చేసి ఆ పాపకి బార్బీ బొమ్మ ఉందా అని తల్లిని అడిగితే లేదని చెప్పింది. ఆయన బార్బీ బొమ్మేకాక బార్బీ సెట్ మొత్తం తెచ్చిచ్చాడు. దేవుడు 'రేపు' అంటే 'కాదు. ఈ రోజే ' అనడం ప్రమాదకరం. మనకొకటి దక్కలేదంటేనే దానికన్నా ఉత్తమమైనది లభిస్తుందని మనం నమ్మాలి."

తనకి జినేంద్రకన్నా ఉత్తమమైనవాడు రాసి ఉండబట్టే సాయిబాబా నో చెప్పాడా? అనే ప్రశ్న ఆద్యలో ఉదయించింది. ఆద్యలో చెలరేగిన ఆ ప్రశ్న కొనసాగింది. తను జినేంద్ర కోసం ఎంతగా ప్రార్ధించిందో గుర్తుకి వచ్చింది. సాయిబాబా మీద విశ్వాసంతో తనకి ఇష్టమైన చాక్లెట్స్ తినడం మానేసింది. ఐనా అతని మనసు కరగలేదు. ఆ పాప అర్ధం చేసుకున్నంత తేలిగ్గా తనకి సాయిబాబా నో చెప్పాడని తను ఎందుకు అర్ధం చేసుకోలేకపోయింది? ఇదేనా తనకి బాబా మీద గల విశ్వాసం? బహుశ బాబా తనని ఇక్కడికి పంపించింది ఈ కథని విని నేర్చుకోడానికేనేమో?

ప్రీస్ట్ కొనసాగించాడు.

"జీవితంలో ఇలాంటి నోలు, చిన్న చిన్న సంక్షోభాలు అవసరం. అవి మనల్ని అభివృద్ధి వైపు నడిపిస్తాయి. అడవి అంటుకోవడంలో రెండు రకాలున్నాయి. తరచూ సంభవించే చిన్న చిన్న ఫైర్స్‌ని 'కూల్ ఫైర్స్' అంటారు. కార్చిచ్చు అడవి మొత్తాన్ని ధ్వంసం చేసేస్తుంది. కూల్ ఫైర్స్ రాలిన ఎండుటాకులని, కొమ్మలని కాలుస్తాయి తప్ప చెట్లనేం చేయవు. చెట్లు ఆరోగ్యంగా పెరగడానికి ఆ బూడిద అవసరం. చిన్న వయసులో ఈ కూల్ ఫైర్స్‌లాంటి సంక్షోభాలని ఎదుర్కోవడం అలవడితే పెద్దయ్యాక పెద్ద సంక్షోభాలని కూడా తేలిగ్గా ఎదుర్కోగలుగుతాం. సాధారణంగా సంక్షోభాలు ఆర్ధిక, ఆరోగ్యపరమైనవి. లేదా ప్రేమపరమైనవి. లార్డ్! డోంట్ మూవ్ ది మౌంటైన్. గివ్ మి ది స్ట్రింగ్స్ టు క్లైంబ్ ఇట్. ఆమెన్!"

"ఆమెన్" అంతా చెప్పారు.

"గాడ్ విల్ ఫైండ్ యు వేర్ యు ఆర్, అండ్ టేక్ యు వేర్ హి వాంట్స్ యు టు గో. ఆమెన్."

"ఆమెన్" ఈసారి ఆద్య కూడా చెప్పింది.

"ఇవాళ ఉదయం హైతీలో వచ్చిన భూకంపంలో గాయపడ్డవారికి, మరణించినవారికి స్వస్థత చేకూరాలని ప్రార్దిద్దాం. ఆమెన్"

"ఆమెన్" అంతా చెప్పారు.

"అల్జీర్స్‌లో ఆయిల్ టేంకర్ అంటుకుని మరణించినవారికి ఆత్మశాంతి కలగాలని దేవుడ్ని ప్రార్థిద్దాం. ఆమెన్!"

"ఆమెన్!"

"నిన్న ఇరాక్‌లో కుర్దు ఉగ్రవాదులని అమెరికన్ సైన్యం కాల్చి చంపింది. ఆ పధ్నాలుగుమంది ఉగ్రవాదుల ఆత్మశాంతికోసం దేవుడ్ని ప్రార్థిద్దాం. ఆమెన్."

"ఆమెన్!"

చర్చ్‌లో కేవలం మతం గురించే బోధిస్తారనుకుంది. కాని విశ్వశాంతికోసం కూడా ప్రార్థనలు జరుపుతూ, జీవితాలకి ఉపయోగించే ఉత్తేజకరమైన పాఠాలని కూడా చెప్తారని మొదటిసారి చర్చ్‌కి హాజరైన ఆద్యకి తెలిసింది. తేలికపడ్డ మనసుతో బయటకి వెళ్తూంటే ఏదో తెలియనిది ఆ ప్రదేశంలో తనలోకి ప్రవేశించింది అనిపించింది. తీసుకున్న బైబిల్‌ని బల్లమీద ఉంచేసింది.

వర్షం వెలిసింది. రోడ్డంతా తడిగా ఉండి, ఇప్పుడు ఆకాశంలో నల్లటి మేఘాలు లేక నీలంగా, నిర్మలంగా కనిపిస్తోంది.

14

ఆద్య మెడికల్ రిపోర్ట్‌లన్నీ ఆ ఉదయం డాక్టర్‌కి అందాయి. ఆయన వాటికి పరిశీలించాక చైత్రకి ఆఫీస్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

"ఆద్య ఈజ్ ఫైన్. ఎవ్విరిథింగ్ ఈజ్ పెర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్. నథింగ్ టు వర్రీ."

ఆఫీస్ లంచ్ అవర్లో ప్రవర్ధన చైత్రకి ఫోన్ చేసింది.

"ఎలా ఉందది?" ఎప్పటిలానే ఆవిడ మొదటి ప్రశ్న అది.

"బెటర్. మన డాక్టర్ చెప్పింది నిజమే. మతిమరుపు తాత్కాలికమని, అంతా త్వరగా మామూలు అవుతుందని ఇక్కడి డాక్టర్ కూడా చెప్పారు. కాబట్టి కంగారు పడకు. త్వరలో పూర్తిగా కోలుకుంటుందిలే. ఛేంజ్ ఆఫ్ ప్లేస్, కొత్త విషయాలు దాని ఆలోచనలని మారుస్తాయనే నా నమ్మకం" చైత్ర చెప్పింది.

"ఏడుపు నిజంగా ఆపిందా?"

"డోంట్ వర్రీ. పూర్తిగా."

"సాయంత్రం ఇంటికెళ్ళాక ఓసారి దాంతో మాట్లాడిస్తావా?"

"ఒద్దులే. హైద్రాబాద్, దాంతోపాటు అక్కడివన్నీ గుర్తుచేసినట్లుంటుంది. కొంత తేరుకున్నాక అదే చేస్తుందిలే. విషాదం గాఢమైతే మాటలు తగ్గిపోతాయి."

"నిజమే. ముందు అది ఈ ట్రామాలోంచి బయటపడటం కావాలి మనకి" ప్రవర్ధన చెప్పింది.

"మనిషి తను చూసిందే ప్రపంచం అనుకుంటాడు. ప్రపంచంలోని అనేకమందితో పోలిస్తే తనది వడ్డించిన విస్తరిలాంటి జీవితమని అర్థం కాగానే చాలా అసంతృప్తులు, విషాదాలు మాయమైపోతాయి. తమ బ్లెస్సింగ్స్‌ని కౌంట్ చేయడం నేర్చుకున్న ఎవరూ పిరికిగా ఆలోచించరు. వారి దృక్పథం విశాలమౌతుంది. నాన్న ఎలా ఉన్నారు?" చైత్ర అడిగింది.

"ఆయనా బాధపడుతున్నారు. కాని నా ముందు బయట పడరు."

"బాబాయ్‌కి, ఎవరికీ తెలీదుగా?"

"ఊహూ. ఎవరైనా అదేది అని అడిగితే ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళిందని చెప్పాలని అనుకున్నాం."

"ఆ అనుమానం వచ్చే బీచ్‌లో తీసిన డాలీ ఫోటోలని కజిన్స్ గ్రూప్‌లో పోస్ట్ చేయలేదు."

మరి కొద్దిసేపు మాట్లాడాక చైత్ర చెప్పింది.

"ఒకే అమ్మా! బై. లంచ్ టైం ఐపోయింది."

"బై."

"టేక్ కేర్."

చైత్ర లైన్ కట్ చేసింది.

ఆఫీస్ పనయ్యాక చైత్ర కంపెనీ బండిలో ఇంటికి బయలుదేరింది. దారిలో డ్రైవర్ సైమన్ని అడిగింది.

"ఈ శనివారం నువ్వు ఫ్రీనా? నా చెల్లెల్ని ఎక్కడికైనా తీసుకెళ్ళాలని అనుకుంటున్నాను. నువ్వు సరేనంటే మేనేజర్‌కి వెహికల్ రిక్విజిషన్ ఇస్తాను."

"సారీ మేం. మా తాత పోయారని మీకు తెలుసుగా. ఆయన ఫ్యూనరల్ గురించి మాట్లాడటానికి మా ఊరు వెళ్తున్నాను. ఐ హోప్ యు అండర్‌స్టాండ్."

"అదేమిటి? ఆయన పోయి నలుగు నెలలైందిగా? ఫ్యూనరల్ ఇంకా కాలేదా?" చైత్ర ఆశ్చర్యంగా అడిగంది.

"ఊహూ. శవాన్ని మార్చురీలో ఉంచారు."

"ఓకే."

ఆలోచించి వెంటనే ఎన్రికోకి ఫోన్ చేసి అడిగింది.

"వీకెండ్‌కి నీ ప్లాన్స్ ఏమిటి?"

"ప్లాన్సేం లేవు."

"శనివారం నా చెల్లెల్ని ఎక్కడికైనా తీసుకెళ్ళాలని అనుకుంటున్నాను. ఎనీ సజెషన్స్?"

"ఎక్కడికి వెళ్దాం? కేం కోస్ట్?" అతను అడిగాడు.

"దాని గురించి విన్నాను కాని చూడలేదు. నా డ్రైవర్ సైమన్ అందుబాటులో లేడు. మీ డ్రైవర్ ఐజాక్‌ని దయచేసి అడుగుతావా?" కోరింది.

"ఓ! తప్పకుండా. అక్కడిదాకా వెళ్తున్నాం కాబట్టి దగ్గరలోని కకుం నేషనల్ పార్క్‌కి కూడా వెళ్దాం. ఐ విల్ గెట్ బేక్ ఇన్ ఏ ఫ్యూ మినిట్స్."

ఆమె వెహికల్ గేట్ దాటి ఇంటి ఆవరణలోకి వస్తూండగా అతన్నించి ఫోన్ వచ్చింది.

"ఐజాక్ సరే అన్నాడు. కన్‌ఫర్మ్ డ్? వెహికల్ రిక్విజిషన్ పంపనా?" ఎన్రికో అడిగాడు.

"కన్‌ఫర్మ్ డ్. దారిలో పెట్రోల్ కొట్టించుకుని వెళ్దాం. బై ఎన్రికో. అండ్ థాంక్స్."

"బై. టేక్ కేర్."

అతనితో మాట్లాడాక బండి దిగి సైమన్‌తో చెప్పింది.

"నువ్వు వెళ్ళచ్చు సైమన్. అండ్ థాంక్స్."

"సారీ ఎబౌట్ సండే మేమ్."

"ప్లీజ్ డోంట్ బాదర్. ఐజాక్ ఈజ్ ఫ్రీ" చెప్పి ఆమె తలుపుని తాళం చెవితో తెరచుకుని లోపలకి వెళ్ళింది.

"హౌ ఈజ్ యువర్ డే?" సౌత్ ఆఫ్రికన్ సినిమాని చూస్తున్న ఆద్యని అడిగింది.

"ఫైన్. హౌ వజ్ యువర్ డే?" ఆద్య ప్రశ్నించింది.

"ఫైన్. ఒకోసారి సమస్యలు వస్తూంటాయి. వాటిని పరిష్కరించేదాకా నా జాబ్‌లో వత్తిడి. ఈ దేశం వాళ్ళు సరిగ్గా పనిచేయరు. అజమాయిషీ చేస్తుండాలి.

ఆమె బాత్‌రూంలోకి వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చాక చెప్పింది.

"ఈ శనివారం మనం కకుం నేషనల్ పార్క్‌కి, కేప్ కోస్ట్ అనే కోటకి వెళ్తున్నాం."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments